క్లుప్తంగా

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



రైతులతో కలసి ర్యాలీ చేస్తున్న ఏవో

సఖినేటిపల్లి: అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సమావేశాలను ఆ శాఖ నిర్వహించింది. ప్రభుత్వ పరంగా రైతులకు అమలు చేస్తున్న పథకాలు గురించి ఏవో పీవీ నరసింహారావు వివరించారు. అలాగే ఆయా గ్రామాల రైతులతో కలసి ఏవో ర్యాలీలు నిర్వహించారు. అంతర్వేదికరలో నారుమడుల్లో సస్యరక్షణ చర్యలపై తగు సూచనలు ఏవో రైతులకు వివరించారు. ప్రజాప్రతినిధులు, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ధర్మ ప్రచారం

మామిడికుదురు: గృహ సంపర్క్ ఇంటింటికీ ధర్మ ప్రచారం కార్యక్రమం బుధవారం మగటపల్లిలో జరిగింది. దీనిలో భాగంగా జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి హిందువులు తరలిరావాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కె.ధర్మారావు కోరారు. దేవాలయాలను రక్షించుకుందాం నినాదంతో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి పాటి గంగా సత్యనారాయణ, మామిడికుదురు మండల కన్వీనర్ శ్రీనివాసరావు, రాజోలు ధర్మ ప్రచారక్ బైరిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



అంబాజీపేటలో జరుగుతున్న ఎన్‌ఏఎస్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ సలీంబాషా

అంబాజీపేట: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణ సాధించేలా ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఈఓ షేక్ సలీంబాషా అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) సర్వేలో భాగంగా తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో 30 మందిని సర్వే బృందం ఎంపిక చేశారన్నారు. ఈ 30 మంది విద్యార్థులకు ఎన్‌ఏఎస్ పరీక్ష నిర్వహణ ఎలా సాగుతుందో పరిశీలించానన్నారు. పదిలో మంచి మార్కులు సాధించాలంటే ప్రతి సబ్జెక్టును ఇష్టంగా మార్చుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎంఎకే భీమారావు, హెచ్‌ఎం కడలి సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పరంజ్యోతి వర్ధంతి

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ఏఐకేఎంఎస్ నేత రంప జాను ఆధ్వర్యంలో బుధవారం కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి వర్ధంతి జరిగింది. స్థానిక యర్ర కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కమ్యూనిస్టు నేతలు తొలుత కామ్రేడ్ పరంజ్యోతి చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమ్యూనిస్టులు పాల్గొని ప్రసంగించారు.

హౌస్ హోల్డ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

ఆలమూరు: మండలంలోని జరుగుతున్న హౌస్ హోల్డ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం జరిగింది. మండలంలో 18 గ్రామాల్లో 26,042 కుటుంబాలు ఉండగా ప్రస్తుతం 88 శాతం మేర సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన కుటుంబాల సర్వేను ఈనెల 10 లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ రాజు కోరారు. సూపరింటెండెంట్ ఎం.మెహెర్ ప్రకాష్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్.గన్నవరంలో డ్రెడ్జర్ సీజ్



ఎల్.గన్నవరంలో సీజ్ చేసిన డ్రెడ్జర్

పి.గన్నవరం: పాత అక్విడెక్ట్ దిగువన ఇసుక ర్యాంపులో రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తీస్తున్న డ్రెడ్జర్‌ను, యర్రంశెట్టివారిపాలెంలో మూడు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్టు తహసీల్దార్ శ్రీపల్లవి తెలిపారు. సీజ్ చేసిన డ్రెడ్జర్‌ను ఇరిగేషన్, ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

గోదావరి కోత తీవ్రం

- కలవరపెడుతున్న వైనం
- నదిలో కూలుతున్న కొబ్బరి చెట్లు



పెదపట్నంలంకలో దిగబడిపోతున్న గోదావరి రివిట్‌మెంట్



బి.దొడ్డవరంలో గోదావరిలో కూలిపోయిన కొబ్బరి చెట్లు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల్లో నదీకోత తీవ్రంగా ఉంది. గోదావరి కోత రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రూ.కోట్లు విలువైన భూములు ఏటా నదీ గర్భంలో కలసిపోతున్నాయి. రోజు రోజుకూ నదీపాతం శ్రుతి మించడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు గోదావరి కోత మరింత తీవ్రమైంది. మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, బాడిలంక, ఆదుర్రు గ్రామాల్లో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో కోత ప్రభావంత రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. కోత నివారణకు రివిట్‌మెంట్ల నిర్మాణంతో పాటు గ్రోయిన్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

కనుమరుగవుతున్న గ్రోయిన్లు...

గోదావరి నీటి ప్రవాహాన్ని మళ్లించి తద్వారా కోతను నివారించేందుకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు గోదావరిలోకి జారిపోతున్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. పై గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు కనుమరుగయ్యాయి. మరి కొన్ని చోట్ల గ్రోయిన్లు పాడైపోవడంతో నదీపాతం మరింత ఎక్కువయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పాడైపోయిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల మరమ్మతులకైనా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై హెడ్‌వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎస్ మూర్తిని వివరణ కోరగా గ్రోయిన్లతో పాటు పిచ్చింగ్ రివిట్‌మెంట్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు.

అర్హులకే కేశఖండన కార్మికులుగా గుర్తింపు



అప్పనపల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కేశ ఖండన శాల కార్మికులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం కల్యాణ కట్ట కేశఖండనలో అర్హులను మాత్రమే కార్మికులుగా గుర్తిస్తూ జీఓ 110 విడుదల చేశారని సంఘం కార్మికులు తెలిపారు. అప్పనపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షులు ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, గౌరవాధ్యక్షుడు రామేశ్వరపు వెంకటరమణమూర్తి, కార్యదర్శి పీవీ దుర్గారావు మాట్లాడారు. కేశ ఖండనలో 46 మంది సభ్యులు పని చేస్తున్నామన్నారు. దేవాలయ జేఏసీ నేతలు, ధర్మకర్తల మండలి, ఎండోమెంట్స్ అధికారుల సమక్షంలో జరిగిన సమావేశంలో 37 మంది కార్మికులను కొనసాగించాలని నిర్ణయించారన్నారు. కానీ దీనిపై అధికారుల్లో స్పందన లేకపోవడంతో వారం రోజులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టామన్నారు. దీనిపై స్పందించిన అధికారులు 24 మంది కార్మికులను కొనసాగించాలని నిర్ణయించారన్నారు. విధులకు సక్రమంగా హాజరు కాని 13 మందిని మినహాయించి మిగిలిన వారికి ఆర్డర్ ఇచ్చారన్నారు. అందరి సమక్షంలో ఈ నిర్ణయం జరిగిందన్నారు. దీనిపై కొంతమంది కార్మికులు అసత్య ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం ఎంతమాత్రం భావ్యం కాదని పేర్కొన్నారు. జీవో 110పై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని తేల్చి చెప్పారు. తమకు వస్తున్న వేతనాన్ని నిలుపుదల చేయాలన్న కుట్రతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.51,116 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఉంద్రాజవరానికి ఆలపాటి శ్యామల బుధవారం రూ.51,116 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.



దాత శ్యామలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



అంబాజీపేటలో వీఆర్వోలతో సమావేశమైన తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 నుంచి రెవన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నామన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులపై వీఆర్వోలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. 6న ఇరుసుమండ, 9న పుల్లేటికుర్రు, 10న కె.పెదపూడి, 11న గంగలకుర్రు, 12న మాచవరం, 13న ఇసుకపూడి, 16న చిరతపూడి, 17న నందంపూడి, 18న తొండవరం, వాకలగరువు, 19న పసుపల్లి, 20న ముక్కామల, 21న వక్కలంక, 22న మొసలపల్లి రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. భూమి విషయంలో అభ్యంతరాలు, తేడాలు ఉంటే సభలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే అండగల్‌లో పేరు చేరకపోయిన తదితర వాటిని ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సభలను స్థానిక గ్రామ సచివాలయాల వద్ద చేపట్టనున్నామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లో ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో రైతులకు రెవెన్యూ సదస్సుల సమయాలను తెలియజేయాలని వీఆర్వోలకు సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



ఆలమూరులో ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

అంబాజీపేట: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగే పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. స్థానిక పోలింగ్ కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 129 ఓట్లు ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నలుగురు పోలింగ్ సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించారన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించిన వారిలో ఉన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక తహసీల్దార్, ఏఈఆర్ఓ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగు కేంద్రం నంబర్ 56లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 86 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఓటరు స్లిప్పులను ఉపాధ్యాయులకు పంపిణీ చేశామన్నారు. ఆమె వెంట పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ ఎ.రాజు ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకూ నిర్వహించనున్న ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 55 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం



పెదపళ్లలో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సువర్చలాదేవి, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు.

లైంగిక వేధింపులు ఉపాధ్యాయ వృత్తికే కళంకం



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

మామిడికుదురు: అభం శుభం తెలియని బాలికలను లైంగికంగా వేధించడం ఉపాధ్యాయ వృత్తికే కళంకమని కోనసీమ డీఈవో ఎస్‌కే సలీంబాషా ఆందోళన వ్యక్తం చేశారు. మామిడికుదురులో బుధవారం మండలంలోని ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇటీవల ఉపాధ్యాయులపై రెండు పోక్సో కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పరిపూర్ణమైన పౌరుడిని తీర్చిదిద్దే గౌరవమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులు ఈ విధంగా ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. ఉపాధ్యాయుల్లో పరివర్తన తీసుకురావడం కోసం 'ఉపాధ్యాయుడా మేలుకో' పేరిట కార్యక్రమం చేపట్టామన్నారు. నోబెల్ ప్రొఫెషన్‌లో ఉన్నామన్న సంగతిని ప్రతి ఉపాధ్యాయుడు గుర్తు పెట్టుకుని నడుచుకోవాలన్నారు. మీ కుటుంబంతో పాటు మీరు తల ఎత్తుకునేలా మీ ప్రవర్తన ఉండాలని హితబోధ చేశారు. సమావేశంలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్‌ఎం నిరంజని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో కాలికి గాయం కావడంతో కాలు పోగొట్టుకున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండపేట పట్టణానికి చెందిన ములపర్తి శామ్యూల్‌కి 29. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయం కావడంతో కాలుకు రాడ్లు వేశారు. అయితే అది ఇన్ఫెక్షన్ అవ్వడంతో వైద్యులు కాలు తొలగించారు. ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా రోజూ ఇంజక్షన్ ఇవ్వాల్సిన పరిస్థితి. దీంతో అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. మండపేటలో సంస్థ సభ్యులు చేతుల మీదుగా శామ్యూల్‌కి రూ.15 వేల చెక్కు అందజేశారు.


ఆలమూరు మండల అధికారుల ఫోన్ నంబర్లు

హోదా	పేరు	ఫోన్ నంబర్
తహసీల్దార్	కేజే ప్రకాష్‌బాబు	98499 03902
రావులపాలెం సీఐ	సీహెచ్ విద్యాసాగర్	94407 96537
సబ్ ఇన్‌స్పెక్టర్	ఎం.అశోక్	9440904849
ఎంపీడీఓ	కె.జాన్‌లింకన్	94938 17051
ఈఓపీఆర్డీ	ఎ.రాజు	83175 42815
ఏడీఏ	కె.నాగేశ్వరరావు	83310 56664
ఏఓ	ఎస్.లక్ష్మీ లావణ్య	83310 56557
ఏపీఓ	జి.అరుణకుమారి	70933 23644
ఏపీఎం	ఎం.ధనరాజు	98499 01696
హౌసింగ్ జేఈ	డి.శ్రీనివాసు	70939 30448
ఎంఈఓ–1	బి.అప్పాజీ	80748 05733
ఎంఈఓ–2	కేవీ సుబ్బరాజు	96189 37973
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	పి.పద్మ	91001 21135
సీడీపీఓ కొత్తపేట	పి.శారద	94408 14683
చొప్పెల్ల పీహెచ్‌సీ	డి.సువర్చలాదేవి	70136 40523
పెదపళ్ల పీహెచ్‌సీ	పి.భవానీశంకర్	88017 87816
ఇరిగేషన్ జేఈ	కృష్ణ త్రిమూర్తులు	83286 29109
పశుసంవర్థకశాఖ ఏడీ	ఎల్.అనిత	95503 93727
పశువైద్యాధికారి	జి.భానుప్రసాద్	95332 87404
ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	డి.నాగేశ్వరరావు	97012 87828
ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	పి.రాంబాబు	91609 88844
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	టీఎస్‌వీ నాగలక్ష్మి	63099 39852
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	వై.అరుంధతి	89778 30575
ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి	పి.గోపిరామ్	93467 87187
మండల ఇంజినీరింగ్ జేఈ	డి.వీరభద్రరావు	83175 43987
ఆర్అండ్‌బీ జేఈ (ఇన్‌చార్జి)	సూర్యనారాయణ	94408 18285

విద్యార్థులకు పుస్తకాలు, వాటర్ బాటిళ్ల పంపిణీ

రావులపాలెం: మండలంలోని దేవరపల్లి శివారు పితానివారిపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బూసి విద్యాప్రసన్న పుస్తకాలు, స్టేషనరీ, వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గుత్తుల జ్యోతి, సభ్యులు రాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సీహెచ్ త్రిమూర్తులు, కె.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో ఐఏఎస్ అధికారి



ఐఏఎస్ హర్షవర్ధన్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న సారథి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం సీనియర్ ఐఏఎస్ అధికారి హర్షవర్ధన్, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డూ ప్రసాదం, చిత్రపటాన్ని సూపరింటెండెంట్ పి.విజయసారథి ఆయనకు అందజేశారు. వెంట తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డీటీ సీహెచ్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, వీఆర్వో బి.సీతారామం పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో జల్ జీవన్ మిషన్ నిధులతో రూ.64.80 లక్షలతో పైపులైన్ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ గ్రామంలో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయడంలో భాగంగా ఈ పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పైపులైన్ పనులు 90 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

15న మాలల చలో గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జిల్లా స్థాయి కమిటీ సభ్యులు

రావులపాలెం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేస్తున్న ఆందోళనలో భాగంగా ఈ నెల 15న గుంటూరులో నిర్వహిస్తున్న బహిరంగ సభలో రాష్ట్ర వ్యాప్తంగా మాలలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా స్థాయి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. రావులపాలెంలోని ఆదిలక్ష్మీనగర్‌లో బుధవారం గొల్లపల్లి డేవిడ్‌రాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి కన్వీనర్లు జంగా బాబురావు ఇసుకపట్ల రఘుబాబు, నెల్లి లక్ష్మీపతి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలోనూ, రాష్ట్రంలోను యథేచ్ఛగా రాజ్యాంగా ఉల్లంఘన జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇది తేటతెల్లమయిందన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు సహేతుకంగా వ్యవహరించలేదన్నారు. పార్లమెంట్‌లో బిల్ పాస్ చేస్తే కాని జరగని వర్గీకరణ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం తమ గుప్పెట్లో పెట్టుకుని రాజ్యాంగ ఉల్లంఘన చేసి తీర్పు ఇచ్చిందన్నారు. అన్నదమ్ములుగా ఉన్న మాలమాదిగల మధ్య మరోసారి చిచ్చు పెట్టి మంటకాగుతుందన్నారు. మొన్న తెలంగాణ నడిబొడ్డున హైదరాబాద్‌లో గర్జించిన మాలలు, ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల వర్గీకరణ వ్యతిరేక సభకు లక్షలాది మందిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 14న అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాలలు వన సమారాధన జరగవలసి ఉండగా గుంటూరు మాలలు బహిరంగ సభ కారణంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. గుంటూరు సభ అనంతరం అమలాపురంలో మాలల సమారాధన నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటిలోని మాల సభకు హాజరయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొప్పుల శ్రీధర్, వైవీ, కోణాల రాజు, గెద్దం శ్రీనివాస్, గెద్దం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే 112కు కాల్ చేయాలి

సఖినేటిపల్లి: పాఠశాలలకు వచ్చే, వెళ్లే సమయంలో ఆకతాయిలు వేధిస్తుంటే 112 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సఖినేటిపల్లి పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జి.నిర్మల, కానిస్టేబుల్ టి.సంధ్య పిల్లలకు సూచించారు. బుధవారం అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు హైస్కూల్‌లో ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు సూచనల మేరకు హెచ్‌ఎం జాన కనకలింగేశ్వరరావు అధ్యక్షతన మహిళా సంరక్షణ సదస్సు నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కూడా వారు పిల్లలకు వివరించారు. పాఠశాల టీచర్లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.